# విశాల భారతి


తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 20.12.2024 | 24 క్యారెట్లు 79,778.00 | కిలో వెండి 99,988.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:58

www.vishalabharati.com


## అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా



- దృష్టి మళ్లించేందుకే బీజేపీ కుట్ర
- దేశవ్యాప్తంగా ఉద్యమిస్తాం
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే
- అదానీపై చర్చ జరగకుండా బీజేపీ అడ్డుకుంటోంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల వ్యవహారం నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీ ప్రతిస్తోందని

..మిగతా 2 లో



# నేడు కేటీఆర్ అరెస్ట్..!

## రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



- ఈ-కార్ రేస్ గోల్‌మాల్‌పై ఏసీబీ కేసు
- ఏ-1గా కేటీఆర్..
- ఏ-2గా ఐఏఎస్ అరవింద్ కుమార్
- ఏ-3గా హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి
- నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదు
- రూ.55 కోట్ల అక్రమాలు జరిగినట్లు అనుమానం
- ప్రభుత్వ అనుమతి లేకుండానే చెల్లింపులు
- ఆర్బీఐ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా విదేశీ కంపెనీకి బదిలీ
- ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఏసీబీ అధికారులు
- విచారణకు ప్రత్యేక అధికారుల బృందం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఫార్ములా ఈ-కార్ రేసులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ-కార్ రేసులో గోల్‌మాల్ జరిగిందని గుర్తించిన ఏసీబీ ఈ మేరకు విచారణ చేపట్టింది. అందులో భాగంగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు చేసింది. ఏ క్షణంలోనైనా ఆయనను అరెస్టు చేసేందుకు ఏసీబీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలుస్తోంది. కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌పైనా ఏసీబీ కేసు నమోదు చేసింది. అలాగే హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిని చేర్చారు. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిని చేరుస్తూ

..మిగతా 2 లో

### నా వెంట్రుక కూడా పీకలేరు

నేను ఏ తప్పు చేయలేదు.. భయపడేది లేదు

- ఏం పీక్కుంటారో పీక్కోండి
- న్యాయపరంగా ఏం చేయాలో అది చేస్తా
- రాజకీయ కక్షతోనే నాపై కేసు
- సీఎం రేవంత్ శాడిస్టులా ప్రవర్తిస్తున్నడు
- తనపై కేసు నమోదుపై స్పందించిన కేటీఆర్

..మిగతా 2 లో

## తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా



- కాళేశ్వరం కమిషన్ విచారణలో స్మితా సభర్వాల్
- బ్యారేజీల అనుమతులపై పీసీ ఘోష్ ప్రశ్నలు
- బ్యారేజీ నిర్మాణాలు సరిగ్గానే జరిగాయా..?
- రాష్ట్రంపై ఆర్థిక భారం మీకు కనిపించలేదా..?
- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌పై పీసీ ఘోష్ ప్రశ్నల వర్షం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై అవకతవకలు జరిగాయనే విచారణలో భాగంగా ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఈరోజు (డిసెంబరు 19)న హాజరయ్యారు. దీనిపై స్మితా సభర్వాల్ గత ప్రభుత్వ సీఎంఓ కార్యలయంలో పదేళ్ల పాటు కార్యదర్శిగా పనిచేస్తూ, ఏడు శాఖలను పర్యవేక్షించినట్లు కమిషన్‌కు వివరించారు. సాంకేతిక అంశాల జోలికి వెళ్లలేదని ఆయా శాఖలను సమన్వయం మాత్రం చేశానని జస్టిస్ పీసీ ఘోష్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. రాష్ట్ర క్యాబినెట్ పర్మిషన్ లేకుండానే

..మిగతా 2 లో



## అసెంబ్లీలో మాటల యుద్ధం..

- సర్కారుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- స్పీకర్ క్షమాపణ ఎందుకు చెబుతారు?
- మంత్రి శ్రీధర్‌బాబు ఫైర్

..మిగతా 2 లో

## ఓఆర్ఆర్ టోల్ టెండర్లపై సిట్

### డబ్బులు తీసుకుని అప్పనంగా మ్మేశారు..




- కొంతమందికి లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు
- హరీశ్‌రావు కోరిక మేరకే దర్యాప్తు
- త్వరలో కేబినెట్‌లో చర్చించి విధివిధానాలు
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఓఆర్ఆర్ టోల్ టెండర్లపై సిట్‌ను ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో ఔటర్‌రింగ్ రోడ్డు టోల్ కాంట్రాక్ట్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఔటర్‌రింగ్ రోడ్డును ఆయాచితంగా, అప్పనంగా ఎవరికో అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. లీజ్ మీద విచారణ జరపాలని హరీశ్‌రావు కోరటం అభినందనీయమన్నారు. టెండర్లపై విచారణ జరిపేందుకు సిట్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. మంత్రివర్గంలో చర్చించి విధివిధానాలు రూపొందిస్తామని తెలిపారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా రాణించడానికి కారణం కృష్ణా గోదావరి నదీ జలాలు, ఓఆర్ఆర్, ఇంటర్నేషనల్

..మిగతా 2 లో

## హరీశ్‌రావు డిప్యూటీ ఫ్లోర్ లీడరా..?



- ఆయనది ఏ హోదానో చెప్పాలి
- కేసీఆర్ ఎందుకు రావడం లేదు
- పదేళ్లలో నల్గొండను నాశనం చేశారు
- ఆ జిల్లాపై మాట్లాడే హక్కు హరీష్‌కు ఎక్కడిది..?
- అసెంబ్లీలో మంత్రి కోమటి రెడ్డి హాట్ కామెంట్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఐదో రోజు అసెంబ్లీ సమాశాలు ప్రారంభం కాగానే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావుపై మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏడాదిగా ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అసలు అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్ కేసీఆరా.. హరీశా అంటూ ఎద్దేవా

..మిగతా 3 లో




## అప్పులతో రాష్ట్రాన్ని దివాలా తీయించారు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై ఆగ్రహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు చేసిన అప్పులు,

..మిగతా 5 లో



## మార్చి 21 నుంచి పది పరీక్షలు

- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్ఎస్‌సీ బోర్డు
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పరీక్షల కాలం దగ్గర పడుతోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షల షెడ్యూల్

..మిగతా 4 లో

## బలగం మొగిలయ్య కన్నుమూత



- కొంతకాలంగా తీవ్ర అనారోగ్యం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

..మిగతా 3 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
20.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఓఆర్ఆర్ టోల్ టెండర్లపై సిట్

**మొదటిపేజీ తరువాయి :** ఎయిర్‌పోర్ట్, హైదరాబాద్ మెట్రో రైలు, ఫార్మా, ఐటీ కంపెనీలు, శాంతి భద్రతలు కాపాడటం, మత సామరస్యం పెంపొందించడమేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భాగ్యనగరం విశ్వనగరంగా ఎదుగుతుందంటే అందుకు కారణం కాంగ్రెస్ పార్టీయేనని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వల్ల రాష్ట్ర ఆదాయం పెరిగిందన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వలన రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హస్తం పార్టీ తీసుకున్న విధానపరమైన నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆదాయం పెరిగిందన్నారు. ఎన్నికల ముంగిట ఔటర్ రింగ్ రోడ్డును 30 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వటంపై రాష్ట్రంలో తీవ్ర చర్చ జరిగిందని తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు లీజు టెండర్లపై విచారణ జరిపించేందుకు సిట్ ను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## నా వెంట్రుక కూడా పీకలేరు




- నేను ఏ తప్పు చేయలేదు.. భయపడేది లేదు
- ఏం పీక్కుంటారో పీక్కోండి
- న్యాయపరంగా ఏం చేయాలో అది చేస్తా
- రాజకీయ కక్షతోనే నాపై కేసు
- సీఎం రేవంత్ శాడిస్టులా ప్రవర్తిస్తున్నడు
- తనపై కేసు నమోదుపై స్పందించిన కేటీఆర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రాన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు హబ్‌గా మార్చాలనే లక్ష్యంతోనే హైదరాబాద్‌లో ఫార్ములాఈ కార్ రేస్ నిర్వహించామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఫార్ములాఈ కార్ రేస్ వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) తనపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ కార్ రేస్ జరపాలని చాలా ప్రయత్నాలు జరిగాయన్న కేటీఆర్ 2001లోనే చంద్రబాబు ఫార్ములా1 రేస్ నిర్వహించేందుకు యత్నించారని తెలిపారు. దురదృష్టవశాత్తు చంద్రబాబు ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఫార్ములా ఈ కార్ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని కోరామని పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల మధ్య చర్చ పెడదాం అని స్పీకర్‌ను కోరానన్న ఆయన ఫార్ములా ఈ కార్ అంశంపై చర్చించే సత్తా ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

ఫార్ములా ఈ కార్ అంశంలో అక్రమాలు చేశామని ప్రభుత్వం అంటుందన్న కేటీఆర్ వాటిని నిరూపించకుండా లీకులిస్తూ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి దమ్ముంటే అసెంబ్లీలో ఇదే అంశంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. రోజుకో అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి సమగ్రంగా చర్చించాలని సవాల్ విసిరారు. ఫార్ములా1 రేస్ ట్రాక్ కోసం గోపన్‌పల్లిలో భూసేకరణ జరిగిందని కేటీఆర్ తెలిపారు. అక్కడ సీఎం రేవంత్ రెడ్డికి కూడా 15 ఎకరాల భూమి ఉందని వివరించారు. ఎఫ్1 చుట్టూ నగరాల అభివృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఎఫ్1 రేస్‌ల నిర్వహణకు దేశవ్యాప్త పోటీ ఉందని కేటీఆర్ అన్నారు. చంద్రబాబు 2001లో జినోమ్‌వ్యాలీని ఏర్పాటు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. నాడు ఏర్పాటు చేసిన జినోమ్ వ్యాలీ ఇప్పుడు ఉపయోగపడుతుందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలకు హైదరాబాద్‌ను హబ్‌గా మార్చాలనేది మా ప్రణాళిక అని కేటీఆర్ తెలిపారు. రేసింగ్ ద్వారా ఈవీ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించాలనేది తమ ఆలోచన అని.. అందుకే వరుసగా 4 సీజన్లు ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణకు ఒప్పందం చేసుకున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఇక ఏసీబీ కేసు ఎందుకు పెడుతున్నారో తనకు అర్థం కావట్లేదని కేటీఆర్ అన్నారు. ఏసీబీ రావడానికి అక్కడ కరెప్షన్ ఏమీ జరగలేదన్నారు. రేవంత్ ప్రభుత్వం కుట్రతోనే ఇదంతా తప్పుడు ప్రచారం చేస్తోంది. డబ్బులు రేస్ నిర్వాహకులకు ముట్టినాయి. కాంగ్రెస్ వల్లే రేస్ తిరిగి వెళ్లిపోయింది. ఇండియా ఇజ్జత్ తీశాడు రేవంత్. మా వెంట్రుక కూడా పీకలేడు. నేను ఏ తప్పు చేయలేదు. నాకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. ఏ తప్పు చేయకపోయినా అరెస్ట్ చేస్తామంటే చేసుకో. మా వెంట ఎందుకు పడుతున్నావో తెలుసు. మీ సీక్రెట్స్ బయటపెట్టినందుకే ఇలా చేస్తున్నావని తెలుసని అన్నారు కేటీఆర్.

# నేడు కేటీఆర్ అరెస్ట్..!

మొదటిపేజీ తరువాయి

ఏసీబీ కేసు ఫైల్ చేసింది. కేటీఆర్‌పై 4 నాన్ బెయిలబుల్ సెక్షన్ల (13 (1) A, 13 (2) పీసీ యాక్ట్, 409, 120B) కింద ఏసీబీ కేసు నమోదు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని అభియోగాలు మోపారు. ఆర్బీఐ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ఎఫ్ఈవో కంపెనీకి రూ.54 కోట్లు హెచ్ఎండీఏ చెల్లించిందని కేసులు పెట్టారు. కేబినెట్ అనుమతి, ఫైనాన్స్ క్లియరెన్స్ లేకుండానే నిధులు చెల్లించినట్టు కేటీఆర్‌పై అభియోగాలు మోపబడ్డాయి. కేటీఆర్ ఆదేశాలతోనే అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు ఏసీబీ అభియోగాలు మోపింది. ఐఏఎస్ అరవింద్‌కుమార్.. ఓ విదేశీ కంపెనీకి ఇండియన్ కరెన్సీని ఎలాంటి అనుమతి లేకుండా చెల్లించడంపై అప్పటి తెలంగాణ ప్రభుత్వానికి రూ.8 కోట్ల ఫైన్ వేసింది ఆర్బీఐ. అధికారంలోకి వచ్చాక ఆర్‌బీఐకి రూ.8 కోట్లు చెల్లించింది కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే, కేబినెట్ అనుమతి లేకుండా సొంత నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్‌పై కుట్ర, చీటింగ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

**యూకేకి చెందిన కంపెనీకి చెల్లింపులు..**

ప్రభుత్వ నిధులు రూ.54 కోట్ల 88లక్షల 87 వేల 043 అక్రమ బదిలీలు అయినట్లు గుర్తించింది. యూకేకి చెందిన ఎఫ్ఈవో ఫార్ములా ఈ ఆపరేషన్ లిమిటెడ్ కంపెనీకి.. రెండు విడతల్లో చెల్లింపు చేసినట్లు గుర్తించారు. మొదట 3/10/2023న రూ.22కోట్ల 69లక్షల 63వేల 125, రెండవ విడత 11/10/2023న 23కోట్ల 01 లక్షల 97వేల 500 బదిలీ అయినట్లు గుర్తించారు. హిమాయత్ నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుండి నిధులు బదిలీ అయ్యాయి. విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారం పడింది. రూ. 8 కోట్ల 6 లక్షల 75వేల 404అదనపు పన్ను భారం పడింది. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థిక శాఖ అనుమతి అవసరం ఉంటుంది. సీజన్10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేకపోవడంతో నిధులను మళ్లించారు.

**అవకతవకలు జరిగినట్లు అనుమానాలు..**

2023, ఫిబ్రవరి 11న ఎంతో ప్రతిష్టాత్మకంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హుస్సేన్ సాగర్ చుట్టూ దాదాపు 2.8 కిలోమీటర్ల ఈ కార్ రేసింగ్ పెట్టింది. 2024 ఫిబ్రవరి 10న ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ రేసింగ్ నిర్వహించడంలేదని విదేశీ కంపెనీ ప్రకటించింది. అయితే ఈ కార్ రేసింగ్ వ్యవహారినికి సంబంధించి దాదాపు రూ.55 కోట్ల వరకు ఆర్థిక శాఖ అనుమతి లేకుండా సంబంధిత డిపార్ట్‌మెంట్ అనుమతి లేకుండానే విదేశీ కంపెనీకి నిధులు విడుదలయ్యాయి. అయితే రూ.55 కోట్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని, నిధుల దుర్వినియోగం జరిగాయని ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఈ నిధుల గోల్‌మాల్‌పై విచారణకు సర్కార్ ఆదేశించింది. ఆర్థికశాఖ అనుమతులకు సంబంధించి ఎక్కడా రికార్డ్స్‌లో లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. విదేశీ కంపెనీలకు ఇంత భారీ మొత్తాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా ఏ విధంగా అప్పగించారని దానిపై స్పష్టత లేకుండాపోయింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

## అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా




మొదటిపేజీ తరువాయి

ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అందుకు అమిత్ షా క్షమాపణలు చెప్పి, రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే తెలిపారు. దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఖర్గే, రాహుల్ సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడారు. 'అమిత్ షాను తొలగించాలని చేయాలని డిమాండ్ చేశాం. కానీ అది జరగదని మాకు తెలుసు. అందుకే శాంతియుతంగా నిరసనలు చేపట్టాం. అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీజేపీ ఇతర అంశాలను లేవనెత్తుతోంది. బీజేపీ ఎంపీలు మమ్మల్ని పార్లమెంటులోకి రానీయకుండా అడ్డుకున్నారు. నన్ను నెట్టారు. నేను బ్యాలెన్స్ తప్పి కింద పడ్డాను' అని ఖర్గే చెప్పారు.

అప్పుడు అదానీ గురించి, ఇప్పుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. 'పార్లమెంటు సమావేశాలకు కొన్నిరోజుల ముందు అదానీపై అమెరికాలో కేసు నమోదైంది. ఆ అంశంపై చర్చ జరగకుండా బీజేపీ సర్వశక్తులా ప్రయత్నించింది. అదానీ అంశాన్ని మరుగునపడేయాలని భావించిన బీజేపీ ఎలాంటి చర్చ జరగకుండా వ్యూహరచన చేసింది. ఆ తర్వాత అమిత్ షా ప్రకటన వచ్చింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆలోచనావిధానం రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు వ్యతిరేకమని, మేము మొదటి నుంచి చెబుతున్నాం. ఆయన గుర్తులు లేకుండా చేయాలన్నది వారి లక్ష్యం. హోంమంత్రి తన మనసులో ఉన్నది అందరి ముందు పెట్టారు. అందుకు క్షమాపణ చెప్పాలి. అలాగే ఆయన రాజీనామా చేయాలని కోరాం' అని మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ తెలిపారు.

## అసెంబ్లీలో మాటల యుద్ధం..

- సర్కారుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- స్పీకర్ క్షమాపణ ఎందుకు చెబుతారు?
- మంత్రి శ్రీధర్‌బాబు ఫైర్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. సభ కార్యకలాపాలపై సభ్యులకు సరిగ్గా సమాచారం ఇవ్వట్లేదని విపక్షాలు అసహనం వ్యక్తం చేశాయి. శాసనసభ నడుపుతున్న తీరుపై విపక్షాలు ఆక్షేపించాయి. సమాచారం లేకుండా ఆర్థిక పరిస్థితిపై చర్చ పెట్టారని విమర్శించాయి. శాసనసభ నిబంధనల ప్రకారం సభ నిర్వహించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్.. స్పీకర్ దృష్టికి తెచ్చారు. శాసనసభ నడిపే తీరు ఇది కాదని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సభ్యులకు సమాచారం లేకుండా ఎలా మాట్లాడతారని భాజపా పక్షనేత మహేశ్వర్‌రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విపక్ష, అధికార సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. సభలో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. సభ నిర్వహణలో కొంత సమాచార లోపం జరిగింది... దీనికే స్పీకర్ సారీ చెబుతారా? అని మండిపడ్డారు. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. "హరీశ్‌రావు, అక్బరుద్దీన్.. ఇద్దరూ సీనియర్ సభ్యులు. సమాచార లోపం జరిగిందని మేమే చెబుతున్నాం. అయినా క్షమాపణ చెప్పాలంటున్నారు. వారు ఏదైనా చెప్పాలనుకుంటే రిక్వెస్ట్ చేయాలి. అంతేకానీ హుకుం జారీ చేయొద్దు. తప్పు చేస్తే తప్పకుండా క్షమాపణ చెబుతాం. ఎంతో ముఖ్యమైన అంశంపై సభలో చర్చ కొనసాగుతుండగా.. చర్చను పక్కదారి పట్టించేందుకే ఇదంతా చేస్తున్నారు. సభ సజావుగా జరగాలని భారాస నేతలు భావించడం లేదు. ప్రభుత్వపరంగా ఏదైనా పొరపాటు జరిగితే శాసనసభ వ్యవహారాల మంత్రిగా నేను బాధ్యత తీసుకుంటా.. జవాబుదారీగా ఉంటా. అంతేకానీ స్పీకర్ క్షమాపణ చెప్పాలంటే.. ఎలా సాధ్యం అవుతుంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.



## తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా

మొదటిపేజీ తరువాయి

జీవోలు వచ్చాయా? అని ప్రశ్నలు సంధించగా, ఆ విషయం తనకు తెలియదని స్మిత సమాధానమిచ్చారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌ల నిర్మాణ అనుమతులు, మంత్రి మండలి సమావేశాల్లో మీ పాత్ర ఏంటి? అని ప్రశ్నించగా ఫైళ్లను పరిశీలించడం వరకే తన విధి అని ఆమె కమిషన్‌కు తెలిపారు. వివిధ శాఖలు, సీఎస్ నుంచి వచ్చే ఫైళ్లను ముఖ్యమంత్రికి క్లుప్తంగా వివరించడం తన బాధ్యత అని ఆమె వివరించారు. జస్టిస్ పీసీ ఘోష్ అడిగిన చాలా ప్రశ్నలకు స్మితా సభర్వాల్ తెలియదు, గుర్తులేదు, అవగాహన లేదు అనే సమాధానం ఇవ్వడం గమనార్హం.

స్మితా సభర్వాల్ అనంతరం మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను కాళేశ్వరం కమిషన్ విచారణ చేసింది. ముఖ్యంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లకు సంబంధించిన అనుమతుల గురించి ఆయన్ను పలు ప్రశ్నలు అడిగారు. బ్యారేజ్ నిర్మాణంలో అంతా సరిగ్గానే జరిగిందా? అని సోమేశ్‌ను కమిషన్ ప్రశ్నించగా, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ, కార్యదర్శి వాటిని పర్యవేక్షించారని సోమేశ్ కుమార్ సమాధానమిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం గురించి వార్తా పత్రికల్లో చదివేవాడినని పేర్కొన్నారు.

తాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించక ముందే బ్యారేజ్‌ల నిర్మాణం కంప్లీట్ అయ్యిందని సోమేశ్ కుమార్ సమాధానం చెప్పారు. వాటి అనుమతులు, క్యాబినెట్ నిర్ణయించిన తీర్మానాల గురించి తనకు తెలియదని కమిషన్‌కు వివరించారు. బ్యారేజీలకు సంబంధించి ఏమైనా సమస్యలు మీ దృష్టికి వచ్చాయా? అని కమిషన్ ప్రశ్నించగా, చాలా ఏళ్లు గడిచింది అని గుర్తుకు లేదని సోమేష్ కుమార్ సమాధానమివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బ్యారేజీల వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడిందని మీకు అనిపించలేదా? అని ఘోష్ కమిషన్ ప్రశ్నించగా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఆ విషయాలను చూసుకుంటారని సోమేశ్ సమాధానమిచ్చారు. శాఖల అధిపతులే చూసుకున్నారంటే, సీఎస్‌గా మీ బాధ్యత ఏంటి? అని కమిషన్ మళ్లీ ప్రశ్న వేసింది. ఫైల్స్ పరిశీలించి లోటుపాట్లు ఉంటే సూచనలిస్తానన్న సోమేశ్‌కుమార్ జస్టిస్ పీసీ ఘోష్‌కు వివరించారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణంలో క్లియరెన్స్ అయిన దస్త్రాల పైన మాత్రమే సంతకం చేసినట్లు సోమేశ్‌కుమార్ తెలిపారు. ఇతర శాఖల గురించి సోమేశ్ కుమార్ చెప్పే ప్రయత్నం చేయగా, కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల గురించి మాత్రమే చెప్పాలని జస్టిస్ పీసీ ఘోష్ ఆయనకు సూచించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అవతవకలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ప్రాజెక్టు నిర్మాణంలో పాత్రలు వహించిన ప్రభుత్వ అధికారులను విచారణకు పిలుస్తూ, పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతుంది. విచారణ పూర్తి కాగానే ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. అనంతరం ప్రభుత్వం బాధ్యులపైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.


## కృష్ణాలో లెక్క తేలాకే గోదావరి–కావేరి అనుసంధానం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కృష్ణా నదిలో ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు తేలే వరకు గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించి ముందుకు వెళ్లకపోవడం మేలని తెలంగాణ కేంద్రానికి సూచించింది. నదుల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా గోదావరికావేరి లింక్‌పై గురువారం జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) సంబంధిత ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలతో సమావేశం నిర్వహించింది. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన గురువారం దిల్లీలో నదుల అనుసంధాన భాగస్వామ్య రాష్ట్రాల సమావేశం జరిగింది. జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ బాలేశ్వర్ ఠాకూర్ హాజరయ్యారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్, సీఈ వి.మోహన్‌కుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్య ప్రసాద్ ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ డిమాండ్లు, అభిప్రాయాలను పునరుద్ఘాటించింది. 'తెలంగాణ రాష్ట్రం కరవు పీడిత ప్రాంతం. కృష్ణా బేసిన్ నుంచి బేసిన్ వెలుపల ఉన్న ఏపీ ప్రాంతానికి నీటిని మళ్లిస్తోంది. నదీ జలాల హక్కుల పోరాటం నేపథ్యంలోనే రాష్ట్రం ఏర్పడింది. నదుల అనుసంధానంలో గోదావరి నీటిని కృష్ణా బేసిన్ మీదుగా మళ్లించనున్నారు. కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన విధి విధానాలు ఇంకా ఖరారు కాలేదు. కృష్ణా ట్రైబ్యునల్ 2లో విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే క్రాస్ ఎగ్జామినేషన్స్ ముగిశాయి. వచ్చే ఏడాది జనవరి నుంచి కీలక వాదనలు ప్రారంభమై ఆరు నెలల్లోనే ముగుస్తాయి.

## బలగం మొగిలయ్య కన్నుమూత

- కొంతకాలంగా తీవ్ర అనారోగ్యం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- సంతాపం ప్రకటించిన పలువురు ప్రముఖులు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

'బలగం' సినిమాలో భావోద్వేగపూరిత పాటను ఆలపించి ప్రేక్షకులను కదిలించిన మొగిలియ్య(67) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయన ఆరోగ్యం క్షీణించడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మరణించారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలానికి చెందిన మొగిలయ్య, కొమురమ్మ దంపతులు తమ పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వచ్చిన కళ బుర్రకథను జీవనాధారంగా మార్చుకున్నారు. మొగిలయ్య టాలెంట్‌ను గుర్తించిన 'బలగం' చిత్ర దర్శకుడు వేణు తన సినిమాలో పాడే అవకాశం ఇచ్చారు. మొగిలయ్య, కొమురమ్మ కలసి పాడిన 'తోడుగా మా తోడుండి ...నీడలా మాతో నడిచి' అనే పాట సినిమాకే హైలెట్‌గా నిలిచింది. మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు కుమారుడు సుదర్శన్, దత్త కుమార్తె మోజేస్ ఉన్నారు. మొగిలయ్య అంత్యక్రియలు స్వగ్రామమైన దుగ్గొండిలో ముగిశాయి. మొగిలయ్య మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం సంగీత, సాహిత్య రంగాలకు తీరని లోటు అని పేర్కొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
20.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## హరీశ్‌రావు డిప్యూటీ ఫ్లోర్ లీడరా..?

మొదటిపేజీ తరువాయి

చేశారు. ప్రజా సమస్యలపై తాము పోరాడుతున్నామని లెక్చర్లు ఇస్తున్న బీఆర్‌ఎస్ నేతలు ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎందుకు సభకు రావట్లేదో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. హరీశ్‌రావు డిప్యూటీ ఫ్లోర్ లీడారా.. ఆయనది ముందు ఏ హోదానో చెప్పాలని ఫైర్ అయ్యారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ నల్గొండ జిల్లా ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. నల్గొండ ప్రజల గురించి, తన గురించి సభలో మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావుకు లేదని మంత్రి కోమటిరెడ్డి ధ్వజమెత్తారు.



## అమిత్ షా దిష్టి బొమ్మ దగ్ధం

- అంబేద్కర్ ఫ్యాషన్ కాదు ఒక విప్లవం
- ఓయూ విద్యార్థి సంఘాల నేతలు

**సికింద్రాబాద్,విశాలభారతి :**

దేశంలో ఉన్న మూల వాసులను మతం పేరుతో వేల సంవత్సరాలుగా దోపిడీకి గురిచేస్తున్నా ఈ మనువాదుల నుండి కాపాడడానికి ఏనాడు ఏ దేవుడు కూడా మనకోసం రాలేదు, కానీ అదే వేల సంవత్సరాలుగా ఈ దోపిడీకి గురి అవుతు అన్యాయానికి, అణచివేతకు, దోపిడీకి గురి అవుతున్న ఈ దేశ ప్రజలకు బాబా సాహెబ్ అంబేద్కర్ అని ఓయూ విద్యార్థులు పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అనే గొప్ప పుస్తకం ద్వారా వారికీ హక్కులు కల్పించి వేల సంవత్సరాలగా హిందూ, బ్రాహ్మణియా మనువాదుల దోపిడీ నుండి ఈ ప్రజలను అభివృద్ధి పథంలోకి నడిపించిన మహానుభావుడు అంబేద్కర్.అలాంటి బాబాసాహెబ్ పేరు తలవడం మాకు ఫ్యాషన్ కాదు అంబేద్కర్ పేరు ఒక విప్లవం బుధవారం పార్లమెంట్ లో నిలబడి రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వాక్యాలు చేసిన అమిత్ షా ఈరోజు నువ్వు అస్థానంలో ఉన్నావంటే అంబేద్కర్ పెట్టిన బిక్ష వల్లనే అనే సంగతి మర్చిపోయి భారతదేశాన్ని హిందూరాజ్యంగా, మనువాదాన్ని అమలులోకి తీసుకవచ్చే ప్రయత్నంలో భాగంగా, దేశంలో అంబేద్కర్ వాదులు చైతన్యం అవుతున్నారనే అక్కసుతో అమిత్ షా పార్లమెంట్ లో ఈ వాక్యాలు చేయడం భారతదేశానికే అవమానం.వెంటనే అమిత్ షా తన వాక్యాలను వెనక్కి తీసుకొని తన మంత్రి పదవికి రాజీనామా చేయాలనీ గురువారం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులుగా అన్నారు.ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట అమిత్ షా చిత్రపటాలు దహనం చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులను, ప్రజాస్వామిక వాధులను ఐక్యం చేసి బీజేపీ, దాని అనుబంధ మనువాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతాం అని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు శ్రీకాంత్,క్రాంతిరాజ్ ,శ్రావణ్, ఉదయ్,దివాకర్,ప్రశాంత్,మహేష్,జయప్రకాశ్,హన్సర్ పాల్గొన్నారు.

## సహజ ఖనిజ సంపదపై కన్నేసిన బడా కాంట్రాక్టర్లు

- వేలాది మెట్రిక్ టన్నుల మట్టి, గ్రావెల్ ను అక్రమార్గంలో తరలింపు
- ఎలాంటి అనుమతులు లేవంటున్న రెవిన్యూ, ఫారెస్టు, మైనింగ్ అధికారులు

**మణుగూరు, విశాలభారతి:**

మండల కేంద్రంలోని సాంబాయిగూడెం గ్రామం అడవిలో గత కొన్ని రోజులుగా అక్రమ మట్టి దందా జోరుగా సాగుతోంది. బీటిపిఎస్ ప్లాంటుకు సంబంధించిన ఓ యాష్ ప్లాంట్ కాంట్రాక్టర్ గత కొన్ని రోజులుగా ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తూ కోట్ల రూపాయలను దోచుకుంటున్నాడు. బిటిపిఎస్ ప్లాంట్ పనుల పేరు మీద
గత నెల రోజులుగా ఫారెస్ట్ మట్టిని అక్రమంగా తరలిస్తున్నాడు. ఫారెస్ట్ భూములకు ఎఫ్ ఆర్ ఓ పట్టాలు ఉన్నా కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టి తోలకాలు చేయొద్దు. కానీ ఈ కాంట్రాక్టర్ ప్రభుత్వ నిబంధనలను




తుంగలో తొక్కుతూ ప్రభుత్వ సంపదను అందిన కాడికి దోచుకుంటున్నాడు. ధనార్జనే ధ్యేయంగా అక్రమ గ్రావెల్ నడిపిస్తూ బడా కాంట్రాక్టర్లు ఏజెన్సీలో సహజ ఖనిజ సంపదపై కన్నేసాడు. భారీ యంత్రాలతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా జోరుగా మట్టి తోలకాలు జరుపుతూ వేలాది మెట్రిక్ టన్నుల కొద్దీ అక్రమార్గంలో తరలిస్తూ కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడు. పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు మండలంలో 1/70 యాక్టు ఉన్నప్పటికీ కనీసం పీసా గ్రామ సభలు కూడా నిర్వహించకుండా ఏద్దేచ్ఛగా బడా కాంట్రాక్టర్లు సహజ ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారని ఆదివాసీ నాయకులు మండిపడుతున్నారు. గత నెల రోజుల నుంచి సాంబయిగూడెం అడవిలో భారీ యంత్రాలను తీసుకొచ్చి జోరుగా మట్టిని తోలుతున్నాడు. దీంతో అధికారులు ఎవరు? ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా అమ్ముకుంటున్నాడు. కాంట్రాక్టర్ పట్టపగలే మట్టితో జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు ఎవరు ఇటు వైపు కన్నెత్తి చూడడంలేదు. వారి ముందు నుంచే లారీలతో కొన్ని టన్నుల కొద్ది మట్టినీ తరలిస్తున్నా తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. దీనికి సంబంధించిన అధికారులు ఎలాంటి అనుమతులు లేవని చెబుతున్నా కాంట్రాక్టర్ మాత్రం అందిన కాడికి ప్రభుత్వ సంపదను దోచుకుంటున్నాడు. ఇంత జరుగుతున్నా ఆ కాంట్రాక్టర్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



## బుక్ ఫెయిర్ ను సద్వినియోగం చేసుకోండి

- సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

**పటాన్ చెరు,విశాలభారతి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం హైదరాబాద్ నగరంలోని లోయర్ ట్యాంక్ బండ్ ఇందిరా పార్క్ వద్ద బుక్ ఫెయిర్ ను ప్రారంభిస్తున్నారని, ఈ బుక్ ఫెయిర్ ను సంగారెడ్డి జిల్లా పాఠకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి .అంజయ్య కోరారు. గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్ డిసెంబర్ 19 నుండి జనవరి 29 వరకు కొనసాగుతదని చెప్పారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అన్ని అదుబాటులో ఉంటాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని గ్రంథాలయాలను జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 20 లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయని, రోజు వారీగా న్యూస్ పేపర్లు, నవలలు, విద్యార్థులకు సంబంధించిన లైబ్రరీలలో అం



దుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మూడు పక్క భవనాలు ఉన్నాయని, మిగతా మూడు అద్దెకు ఉన్నాయని, మిగతావి దాతల సహకారంతో కొనసాగుతున్నాయన్నారు. రాయికోడ్ 50 లక్షలు, నారాయణఖేడ్ ఫస్ట్ ఫ్లోర్ 60 లక్షలు, ఆందోల్ ఫస్ట్ ఫ్లోర్ 60 లక్షలతో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. పటాన్ చెరు గ్రంథాలయం అభివృద్ధి గురించి జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తామని అన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను మోడల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రతి గ్రంథాలయంలో అన్ని రకాల బుక్కులతో పాటు అన్ని విధాలుగా మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను ఆయన పరిశీలించారు.



## సైన్స్ లేకపోతే జీవితమే లేదు

- విద్యార్థుల ప్రయోగాలు రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలి
- సూర్యాపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు

**కోదాడ, విశాలభారతి:** వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధన రంగాలకు నాంది పలకాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి పాఠశాలలో సూర్యాపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 52వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజానికి మనుగడ సైన్స్ అండ్ టెక్నాలజీ అని అన్నారు. సైన్స్ లేకపోతే జీవితమే లేదని విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభిరుచిని పెంచుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలు డాక్టర్లు ఇంజనీర్లు ఉపాధ్యాయులు శాస్త్రవేత్తలు కావాలని కలలు కంటున్నారని వారి కలలను సాకారం చేయాలన్నారు. భారతదేశం శాస్త్రవేత్తలకు పుట్టినిల్లు అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు జీవితాన్ని దారం పోసిన అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తల ఆశయాలను శాసించాలన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యానందిస్తున్నాయన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాదని విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. సూర్యాపేట జిల్లా విద్యార్థుల వైజ్ఞానిక ప్రయోగాలు రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. ప్రతిష్టాత్మకంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సిహెచ్ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎల్ దేవరాజ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఎంపీడీవో రామచంద్రరావు, ఎంఈఓ సలీం షరీఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.



## తుంగతుర్తి అభివృద్ధిని కాలరాస్తున్న ఎమ్మెల్యే సామేల్

**తడకమళ్ళ రవికుమార్**

తుంగతుర్తి, విశాలభారతి: తుంగతుర్తి అభివృద్ధిని విస్మరిస్తున్న ఎమ్మెల్యే మందుల సామ్యూల్ బీఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు తడకమళ్ళ రవికుమార్ అన్నారు మండల కేంద్రంలోని బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మందుల సామెల్ తుంగతుర్తి నియోజకవర్గం అంటే మోత్కూర్ శాలిగౌరారం అడ్డగూడూరు మండలాలు మాత్రమే అనుకుంటున్నారని గ్రామపంచాయతీ రూలర్ డెవలప్మెంట్ పండు కింద నియోజకవర్గానికి 15 కోట్లు మంజూరు అయితే అడ్డగూడూరు 9 కోట్లు శాలిగౌరారం మండలానికి 6కోట్లు కోట్ల కేటాయించారు అన్నారు. ఆయన ఎమ్మెల్యే గెలిచిన మూడు నెలలకే నియోజకవర్గ కేంద్రంలోని తుంగతుర్తి నుండి మనపురం వరకు 20 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నామని హడావుడిన శంకుస్థాపన చేసి గాలికి వదిలేసారు అని ఇప్పటివరకు దాని పట్టించుకోవడంలేదని విమర్శించారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ గా మార్చాలని అఖిలపక్షాల ఆధ్వర్యంలో గతంలో పలు నిరసన కార్యక్రమాలు తెలియజేసిన ప్రాంతాన్ని పక్కనపెట్టి నిన్న ఎమ్మెల్యే మందుల సామెల్ అసెంబ్లీలో మోత్కూరును రెవిన్యూ డివిజన్ మార్చాలని మాట్లాడడానికి తప్పుపట్టారు. మోత్కూర్ తో పాటు తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి కూడా రెవిన్యూ డివిజన్ గా మార్చాలని అడిగి ఉండేది అన్నారు. ఎమ్మెల్యే వ్యవహారం పనితీరు చూస్తూ ఉంటే 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరిగి శాలిగౌరారం మోత్కూర్ అడ్డగూడూరు మండలాలు వేరే నియోజకవర్గంగా మారుతాయి అని ముందుగానే ఆయన ఆ ప్రాంతాలను పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొంకూరి మల్లేష్, బొంకూరి మధు, బొజ్జ సాయికిరణ్,కొండగడుపుల వెంకటేష్, చింతకుంట్ల సురేష్, తడకమళ్ళ మధు,బొంకూరి బాలకృష్ణ, కొండగాడుపుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ ఆకస్మిక తనిఖీలు..

- వెలుగులోకి 'డమ్మీ' విద్యార్థులు!
- దేశ రాజధానిలో అధిక మంది

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ దేశంలోని పలు స్కూళ్లలో డమ్మీ విద్యార్థులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. బుధవారం, గురువారం బెంగళూరు, ఢిల్లీ, వారణాసి, గుజరాత్, బీహార్, ఛత్తీస్‌గఢ్‌లో 29 స్కూళ్లలో ఈ తనిఖీలు చేపట్టింది. అయితే ఈ అంశంపై CBSC కార్యదర్శి హమాన్షు మాట్లాడారు. సీబీఎస్ఈ అధికారి, అనుబంధ పాఠశాల ప్రిన్సిపాల్‌తో కూడిన 29 టీమ్‌లు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయని అన్నారు. చాలా స్కూళ్లలో వాస్తవ హాజరు రికార్డులకు మించి విద్యార్థులను ఎన్‌రోల్ చేయడం వల్ల బోర్డు రూల్స్‌ను వాళ్లు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. మౌలిక సదుపాయల కల్పన విషయంలో కూడా అనేక ఉల్లంఘనలు చోటుచేసున్నట్లు చెప్పారు. రూల్స్ పాటించకపోవడంపై సీబీఎస్ఈ బోర్డు తీవ్రంగా పరిగణించిందని.. ఆయా పాఠశాలలకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతోందని పేర్కొన్నారు. చట్టపరంగా తీసుకునే చర్యలపై కూడా పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఇక బోర్డు రూల్స్ ఉల్లంఘించిన స్కూళ్లలో ఢిల్లీలోనే 18 ఉన్నాయని తెలిపారు. అలాగే వారణాసిలో మూడు, బెంగళూరు, అహ్మదాబాద్, బిలాస్‌పుర్, పట్నాలో రెండు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, మెడిసన్ వంటి ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే చాలామంది విద్యార్థులు ఇలాంటి డమ్మీ సీబీఎస్ఈ స్కూళ్ల వైపు చూస్తుంటారన్నారు.

## పార్లమెంట్ ఆవరణలో ఎంపీల తోపులాట

- కిందపడ్డ ఇద్దరు బీజేపీ ఎంపీలు
- తలకు గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- రాహుల్ తోశారన్న అధికార పార్టీ

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

పార్లమెంటు ఆవరణలో గురువారం అసాధారణ ఘటన చోటుచేసుకుంది. ఎంపీల మధ్య తోపులాట జరిగింది. ఇద్దరు భాజపా ఎంపీలు కిందపడటంతో గాయపడ్డారు. రాహుల్ గాంధీ తోయడంతోనే వారు గాయపడ్డారని అధికార పార్టీ ఆరోపించింది. తనపట్ల ప్రతిపక్ష నేత అభ్యంతరకరంగా ప్రవర్తించారని మహిళా ఎంపీ ఒకరు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను రాహుల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ఖండించింది. తాను సభలోకి వెళ్తుంటే వారే అడ్డుగా వచ్చి నెట్టేశారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌లకూ ఫిర్యాదు అందించాయి. మరోవైపు గాయపడిన ఎంపీలను ఫోన్‌లో ప్రధాని మోదీ పరామర్శించారు. ఈ నేపథ్యంలో పార్లమెంటు గేట్ల వద్ద నిరసన ప్రదర్శనలను స్పీకర్ ఓం బిర్లా నిషేధించారు.



## ఆటల పోటీలను ప్రారంభించిన డా.ముజీబ్

**హైదరాబాద్, విశాలభారతి:** టీఎన్జీఎస్ సెంట్రల్ యూనియన్, అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డా ఎస్ఎంహుస్సేని ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆట పోటీలను తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగ్దేశ్వర్, ప్రధాన కార్యదర్శి డా.ముజీబ్ ప్రారంభించారు. గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్, కేంద్ర సంఘ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, నాయకులు ముహమ్మద్ నాజిర్, బోలిగిద్ద శంకర్, రంగారెడ్డి అధ్యక్షులు శ్రీ. లక్ష్మణ్, సిటీ యూనిట్ కార్యదర్శి హరికృష్ణ, మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్, మాజీ సభ్యురాలు జానకి, ప్రత్యేక ఆహ్వానితులు సీమ ముజీబ్ పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
20.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# మార్చి 21 నుంచి పది పరీక్షలు

**మొదటిపేజీ తరువాయి:** ప్రకటించగా తాజాగా తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డ్ షెడ్యూల్ విడుదల చేసింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. మార్చి 21న ఫస్ట్ లాంగ్వేజ్, 22న సెకండ్ లాంగ్వేజ్, 24న ఇంగ్లీష్, 26న గణితం, 28న ఫిజిక్స్, 29న బయాలజీ, ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 3న ఒకేషనల్ కోర్సు పేపర్ 1 భాషా పరీక్ష, 4న ఒకేషనల్ కోర్సు పేపర్ 2 భాషా పరీక్ష జరగనుంది.





## అమిత్ షా తమ పదవికి రాజీనామా చేయాలి

- జెక్కిడి ప్రభాకర్ రెడ్డి మల్రెడ్డి రాంరెడ్డి రామ్మోహన్ గౌడ్.

ఎల్బీనగర్, విశాలభారతి

ఎల్. బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమంలో మల్రెడ్డి రాంరెడ్డి జెక్కిడి ప్రభాకర్ రెడ్డి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం సమయంలో స్వాతంత్రం కోసం పోరాటం చేయడంతో పాటు దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించి భారతదేశంలోని 140 కోట్ల ప్రజలు దేవుడిగా కొలిచే అంబేద్కర్ పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా ను ఒక ప్రధానిగా నరేంద్ర మోడీ వెనకేసుకు రావడం సిగ్గుచేటు అని అన్నారు. అమిత్ షా దేశ ప్రజానీకానికి భేషరతుగా క్షమాపణ చెప్పి అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, పన్నాల జయపాల్ రెడ్డి, కళ్లెం సుజాత రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, దళిత సంఘాల నాయకులు జోగు రాములు,మాజీ కార్పొరేటర్లు మహిళా నాయకులు బీసీ,ఎస్సీ ,ఎస్టీ , మైనార్టీ నాయకులు ,యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





# నేరాల కట్టడికే కార్డన్ సర్చ్

- పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి
- 60 బైకులు, మూడు కార్లు, 10 ఆటోలు స్వాధీనం

పటాన్ చెరు,విశాలభారతి:

నేరాల కట్టడి కోసమే పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్టుపటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు పటాన్ చెరు మండల చిట్కుల్ పరిధిలోని వడ్డెర కాలనీలో పటాన్ చెరు సీఐ వినాయక రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, 10 మంది డివిజన్ ఇన్స్పెక్టర్లు, డివిజన్ సబ్ ఇన్స్పెక్టర్లు, వందమంది పోలీస్ సిబ్బందితో స్పెషల్ కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగిందని డీఎస్పీ తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... కాలనీవాసులు అనుమానితులపై అనుమానాలు ఉంటే పోలీసులకు తెలియజేయాలని, కొత్త వారికి ఇల్లు అద్దెకు ఇచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, గంజాయి వాడ కూడదు అని సూచించారు. వివిధ పరిశ్రమలో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుండి ఉపాధికి వచ్చే మైగ్రేట్ లేబర్ అధిక సంఖ్యలో నివాసం ఉంటారని సరైన గుర్తింపు కార్డు లేని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మీ చుట్టూ జరిగే నేరాల గురించి అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద అపరిచిత వ్యక్తులపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ప్రజలు ఏమైనా అత్యవసరమైతే 100 కు కాల్ చేయాలని సైబర్ నేరగాల వలలో పడకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## 22 న సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ

పటాన్ చెరు,విశాలభారతి

అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో ఈనెల 22 వ తేదీన ఆదివారం రోజు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రాంగణంలో సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ ఏర్పాటు చేస్తున్నట్లు సనాతన హిందూ ధర్మ జాగృతి సేవా సంస్థ స్థాపకులు మహాదేవ్ స్వామీజీ తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ సద్గురు మహాదేవ్ స్వామీజీ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.సనాతన హిందూ ధర్మంపై జరుగుతున్న అరాచకాలపై హిందూ బంధువులందరికీ జాగృతం చేయడానికి హిందూ ధర్మ జాగృతి మహాసభ ఏర్పాటు చేస్తున్నట్లు ఈ కార్యక్రమానికి 108 మంది పీఠాధిపతులు హాజరై తమ అమృత వాణిని వినిపిస్తారని యావత్ ప్రపంచానికి యోగ, జ్ఞానాన్ని పంచిన పతంజలి మహర్షి తపస్సు చేసిన పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడ నుండే హిందూ బంధువులకు జాగృతి చేయడానికి కంకణం కట్టుకున్నామని మహాదేవ్ స్వామీజీ తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రతి హిందువు ప్రతి కుటుంబం నుంచి హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీరంగూడ ఆలయ కమిటీ సభ్యులు, మాజీ చైర్మన్ నరసింహా రెడ్డి, ఆలయ అర్చకులు ప్రహ్లాద్ పంతులు, తదితరులు పాల్గొన్నారు.




## భవిష్యత్ తరాలకు స్ఫూర్తి కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు,విశాలభారతి

కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. కొర్వి కృష్ణ స్వామి వర్ధంతి పురస్కరించుకొని చిట్కుల్లోని ఆయన నివాసంలో నీలం మధు కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగర మేయర్ గా పని చేసి కొర్వి కృష్ణ స్వామి ముందుచూపుతో చేసిన నగర మాస్టర్ ప్లాన్ చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ముదిరాజ్ మహాసభ సంఘం ఏర్పాటు చేసి వ్యవస్థాపక అధ్యక్షుడిగా చరిత్రలో నిలిచిపోయిన నేత స్వర్గీయ కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ అని కొనియాడారు. ఆయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, పాత్రికేయుడు, విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశీలి అని అన్నారు. ముదిరాజ్ జాతి ఐక్యత కోసం ముదిరాజ్ మహాసభ సంఘాని స్థాపించి వారి అభివృద్ధి కోసం ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. ఆ మహానేత ఆశయాలను కొనసాగించాలని నీలం మధు కోరారు.




## ఘనంగా హిందూ ముస్లిం ఐక్యత దినోత్సవం

**కోదాడ, విశాలభారతి:** హిందూ ముస్లిం ఐక్యత దినోత్సవాన్ని కోదాడ పట్టణంలోని రాజీవ్ చౌక్ చౌరస్తాలో సోషల్ యాక్టివిస్ట్ ఫోరం కన్వీనర్ షేక్ మునీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1927 డిసెంబర్ 19న ఆంగ్లేయులు ఉరి తీసిన భారత స్వాతంత్ర్య సమరయోధులు అమరవీరులు పండిత రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని ముప్పు తిప్పలు పెట్టి మాతృభూమిని బ్రిటిష్ వారి కబంధహస్తాల నుండి విముక్తి చేయాలన్న సంకల్పం ఆ ఇరువురి బాటాలను ఏకం చేసిందన్నారు. మత ధర్మాలు వేరువేరు అయినప్పటికీ స్వాతంత్ర సాధనలో వారి స్నేహబంధం ఆనాటికి ఈనాటికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, ఏపూరి రాజు, భాజన్, రాయపూడి వెంకటనారాయణ, శోభన్, ఖాజామీయా, షఫీ, రఫీ, శ్రీకాంత్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ వై. జంగిర్ కు రతన్ డాటా ఎక్స్లెన్సీ అవార్డు 2024 ఎంపిక

సికింద్రాబాద్, విశాలభారతి:

ప్రముఖ బిజినెస్ మేనేజ్మెంట్ అధినేత ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ హెడ్ ( హెచ్ ఓ డి ) సీనియర్ ప్రొ. వై. జహంగీర్ కు రతన్ టాటా ఎక్సలెన్సీ అవార్డు 2024 ను ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. మార్కెటింగ్ లో యూజీసీ ద్వారా 42 ఆర్టికల్స్ పబ్లిష్ అయ్యాయి. ప్రొఫెసర్ జహంగీర్ పరివేక్షణలో 20 మందికి ఓయూ నుండి పిహెచ్డ్ పట్టాలు పొందారు, ఇంకా 8 మంది పీహెచ్డీ విద్యార్థులు పనిచేస్తున్నారు. బిజినెస్ అనాలైటిక్ ,రూరల్ మార్కెటింగ్ లో నాలుగు పుస్తకాలు ఎడిటర్ గా ఉండి ప్రచురించి అందరి మన్నలు పొందారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు బిజినెస్ డైనమిక్ లో నిర్వహించి నేషనల్ సెమినార్లు నిర్వహించి ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. గతంలో ఓయూ వైస్ ప్రిన్సిపాల్ గా ,అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా చేసి ప్రస్తుతానికి గెస్ట్ హౌస్ డైరెక్టర్ గా మరియు ప్లేస్మెంట్ ఆఫీసర్ గా ఉండి విద్యార్థులకు ఎన్నో మార్గదర్శకాలు బిజినెస్ పైన అలా ఎదగాలని దానిపైన ఎన్నో సూచనలిచ్చి అందరి మన్ననలు పొందారు .ఈనెల 28న, రతన్ టాటా జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బొగ్గులకుంట ఆబిడ్స్ లోని లోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించే ఉత్సవాలలో ఈ అవార్డును ప్రధానం చేయనున్నారు. పలువురు అయిన కు శుభాకాంక్షలు తెలియజేశారు







# గీతంలో క్రీడలు, బృంద స్ఫూర్తిని చాటే 'లక్ష్య' ప్రారంభం

- క్రీడా జ్యోతిని వెలిగించి, వేడుకలు ప్రారంభించిన ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్.రావు

పటాన్ చెరు,విశాలభారతి

గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) హైదరాబాద్ లో రెండు రోజుల అంతర్ కళాశాల క్రీడా పోటీలను 'లక్ష్య2024' పేరిట గురువారం సగర్వంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు క్రీడా జ్యోతిని వెలిగించి, పోటీలు ప్రారంభమైనట్టు లాంఛనంగా ప్రకటించారు. విద్యార్థులంతా వివిధ క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సహించడంతో పాటు బృంద స్ఫూర్తి, సాహచర్యాన్ని ప్రోత్సహించే సమ్మిళిత, ఉత్సాహభరిత వాతావారణాన్ని నెలకొల్పే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ క్రీడలు కేవలం పోటీకి సంబంధించినదే కాదని, ఇది నేర్చుకోవడం ఎదగడం, తోటి విద్యార్థులతో శాశ్వత సంబంధాలను ఏర్పరచుకోవడమని ప్రొఫెసర్ డీ.ఎస్.రావు ఉద్బోధించారు. ఔత్సాహిక విద్యార్థులను ఎమరాల్డ్, డైమండ్, పెరల్, రూబీ, టోపాజ్, సఫైర్ పేరుతో ఆరు బృందాలను ఏర్పాటు చేసి, వారిలో నిబిడీకృతంగా ఉన్న ప్రతిభ, నాయకత్వ లక్షణాలు వెలికితీసేలా ప్రోత్సహిస్తున్నారు. విజేతలకు పతకాలు, ట్రోఫీలతో పాటు ప్రశంసా పత్రాలను కూడా అందజేయనున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జీఎస్బీ డైరెక్టర్ ఇన్ ఛార్జి డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, ఇందులో పాల్గొనే వారికి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశంతో పాటు విలువైన పాఠాలను స్వయంగా నేర్చుకుని, తమంత తాముగా ఎదగడానికి వేదికగా ఆమె అభివర్ణించారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ మాట్లాడుతూ, 'లక్ష్య' వంటి పోటీలు అమూల్యమైన అనుబంధాలను ఏర్పరచడమే గాక, మంచి స్నేహాలను కూడా సృష్టిస్తాయన్నారు. స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ నారాయణరావు చౌదరి వందన సమర్పణతో ప్రారంభోత్సవ వేడుకలు ముగిశాయి. టోపాజ్, ఎమరాల్డ్ జట్ల మధ్య ఉత్కంఠభరితమైన క్రికెట్ మ్యాచ్ తో పోటీలు శ్రీకారం చుట్టుకుని, అందులో పాల్గొనేవారి ఉత్సాహాన్ని, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శింపజేశాయి. పీజీ ప్రోగ్రామ్ చైర్ పర్సన్లు డాక్టర్ శశికాంత్ కొంపెల్లి, డాక్టర్ ఎ.సుబ్రహ్మణ్యం తదితరులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధ్యాపక సమన్వయకర్త డాక్టర్ రూపలత, విద్యార్థి సమన్వయకర్తలు యతేష్, రఘులతో కలిసి ఈ పోటీలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. పలువురు అధ్యాపకులు, సిబ్బంది ప్రతి ఈవెంట్ లో విద్యార్థులకు మద్దతిస్తూ, వారిని ఉత్సాహపరిచారు. ఒక్కో జట్టు ఒక్కో రంగు దుస్తులు ధరించి, మొత్తం క్రీడా మైదానంతా వర్ణశోభితంగా మారి, విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
20.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## అప్పులతో రాష్ట్రాన్ని దివాలా తీయించారు

మొదటిపేజీ తరువాయి

తప్పిదాల ఫలితంగా రాష్ట్రం దివాలా తీసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. "బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.6,71,756 కోట్లు అప్పు చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ మాత్రం ఏడాదిలోనే రూ.1,27,000 కోట్లకుపైగా అప్పులు చేసినట్లు అసెంబ్లీ సాక్షిగా వెల్లడైంది. ఈ రెండు పార్టీలను గెలిపించి అధికారం కట్టబెట్టినందుకు ప్రజలపై రూ.8 లక్షల కోట్ల భారం వేశాయి. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో వడ్డీలు కట్టడానికి మళ్లీ అప్పులు తీసుకునే దుస్థితి ఏర్పడింది. ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి కాంగ్రెస్ పార్టీ హామీలను ఎగ్గొట్టేందుకు సిద్ధమైంది. ఈ విషయంలో ప్రజలను చైతన్యవంతం చేసి రాష్ట్రం మరింత అప్పుల పాలుకాకుండా చూసేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి తరువాత ఉద్యమాలను ఉద్ధృతం చేస్తాం" అని సంజయ్ పేర్కొన్నారు.

## కేంద్ర హోంమంత్రి పై కఠిన చర్యలు తీసుకోవాలి

- జై భీం ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మరాఠీ వివేక్



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ లో చేసిన వ్యాఖ్యలను నందివనపర్తి జై భీం ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మరాటి వివేక్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు భాజాపా అంబేద్కర్ వ్యతిరేక వైఖరిని తెలియజేశాయని , ఆ పార్టీ పూర్వ రూపాలైన జన సంఘ్ , ఆరెసెస్స్ రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో అంబెడ్కర్ నీ వ్యతిరేకించాయని గుర్తు చేశారు. రాజ్యాంగమే లేకుంటే వారికి కేంద్ర మంత్రి పదవులు ఎక్కడివని అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా మాట్లాడిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## 'ప్రజా సమస్యలపైనే సీపీఎం పోరాటం'

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఆక్షేపణీయం'
- 'తుర్కయంజాల్‌లో అట్టహాసంగా సీపీఎం మహాసభలు'
- సీపీఎం మున్సిపల్ కార్యదర్శిగా డి.కిషన్ ఎన్నిక'








**తుర్కయంజాల్, విశాలభారతి:** ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పోరాడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య అన్నారు. స్థానిక అరుణ కన్వెన్షన్ హాల్‌లో సీపీఎం తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రథమ మహాసభలు నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు బి.శంకరయ్య పతాక ఆవిష్కరణ చేశారు. ఇటీవల మరణించిన పార్టీ అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరికి, మూడేళ్ల కాలంలో ప్రజా ఉద్యమాల్లో పనిచేసి అసువులు బాసిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజాస్వామ్యవాదులకు మహాసభ ఘనంగా నివాళులర్పించింది. ఈ మహాసభలకు కె.అరుణ్‌కుమార్, కె.శారద అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.సామేల్, డి.జగదీశ్ అబ్జర్వర్లుగా ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య రాజకీయ రిపోర్టు మహాసభ ముందుంచారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు ప్రస్తావించారు. ఈ మహాసభ తుర్కయంజాల్ ప్రాంతంలోని స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు పనిచేస్తూ వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల రాజకీయ అవగాహనతో ప్రజలను చైతన్యం చేసి పోరాటానికి సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం పార్టీ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ గడిచిన మూడేళ్ల కాలంలో ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలను, కార్యక్రమాలను మహాసభ ఎదుట ఉంచారు. శాఖలవారీగా చర్చించిన సభ్యులు కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. రానున్న కాలంలో సీపీఎం పార్టీగా ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని, ప్రజా సంఘాల నిర్మాణానికి కృషి చేయాలని, స్థానిక సమస్యలపై ఉద్యమించాలని, మహిళా, విద్యార్థి, యువజన, కార్మిక రంగాల్లో వారి సమస్యల పట్ల నిరంతరం అధ్యయనం చేసి, పార్టీ విస్తరణకు కార్యకర్తల బలోపేతానికి కృషి చేయాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం సీపీఎం తుర్కయంజాల్ మున్సిపాలిటీ నూతన కమిటీని 9మందితో మహాసభ ఎన్నుకుంది. కార్యదర్శిగా డి.కిషన్, సభ్యులుగా ఎం.సత్యనారాయణ, కె.అరుణ్‌కుమార్, జె.ఆశీర్వాదం, కె.శ్రీరామమూర్తి, కె.వెంకటకృష్ణ, ఐ.భాస్కర్, కె.శారద, డి.శ్రీధర్‌లను మహాసభ ఎన్నుకుంది.



## 'శ్రీ గణేష్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక'

**'నూతన అధ్యక్షుడిగా బి.విష్ణువర్ధన్'**

**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ 19వ వార్డులోని శ్రీగణేష్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా టి.జనార్ధన్, అధ్యక్షుడిగా బి.విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా ఎన్.శ్రీనివాస్, కె.భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పి.జగన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా పి.శ్రీనివాస్‌రెడ్డి, బి.నర్సింహ, కోశాధికారిగా సీహెచ్. హరినాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారని శేఖర్‌గౌడ్ శాలువాకప్పి సత్కరించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా నూతన కమిటీ పనిచేస్తుందన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర ముఖ్య కార్యక్రమాలు త్వరగా పూర్తియ్యేలా తమ కమిటీ పనిచేస్తుందని తెలిపారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన కార్పొరేటర్ సింధు

**పటాన్ చెరు, విశాలభారతి** భారతి నగర్ డివిజన్ పరిధిలో లబ్ధిదారుడికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అందజేశారు. డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీక చెందిన రాకేష్ రెడ్డికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ ద్వారా 16,000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం కార్పొరేట్ సింధు ఆదర్శ్ రెడ్డి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేద ప్రజల సద్వినిగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు.




## సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తిని కలిసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**ఎల్బీనగర్ ,విశాలభారతి:** జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఐఏఎస్ నీ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కమిషనర్ ని వినతి పత్రం అందజేయడం జరిగింది. హస్తినాపురం నుంచి సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని బి.యన్. రెడ్డి నగర్ సిగ్నల్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువ ఉన్నందున పాదదారులు నడిచేందుకు ఫుటోవర్ బ్రిడ్జిను ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది.సాహనుకూలంగా స్పందించిన కమిషనర్ డివిజన్ అభివృద్ధికి అతిత్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని తెలియజేయడం జరిగింది.




## 'అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి'

- 'దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి'
- సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్'

**తుర్కయంజాల్ ,విశాలభారతి :** భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించేలా కేంద్రమంత్రి అమిత్‌షా మాట్లాడటం దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అన్నారు. పార్లమెంట్‌లో అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ తుర్కయంజాల్‌లోని సాగర్ రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో, నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ అమిత్‌షా తన ఒంటినిండా మనువాద భావజాలాన్ని నింపుకొన్నారని ఆక్షేపించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులు, బాధ్యతల రక్షణకు, వారి ఎదుగుదలకు, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం సర్వోన్నతమైనదన్నారు. దాన్ని జీర్ణించుకోలేని మనువాద పాలకులు కుల, మత ఆధిపత్యాన్ని విస్తరింపజేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అంబేద్కర్‌ని మేధావిగా కీర్తిస్తుంటే మన దేశ పాలకులు మాత్రం అవమానిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, బి.సామేల్, డి.జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు ఈ.నరసింహ, డి.కిషన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గణేష్, మున్సిపల్ నాయకులు ఎం.సత్యనారాయణ, కె.అరుణ్ కుమార్, జె.ఆశీర్వాదం, కె.శారద, శ్రీరామమూర్తి, భాస్కర్, శ్రీధర్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ధరణి దరిద్రం పోయింది

- ధరణి స్థానంలో భూ భారతి
- రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి



**బాల్కొండ, విశాల భారతి** రైతులు ధరణి పోర్టల్ తో చాలా ఇబ్బంది పడ్డారని, భూములు ఉన్న పాస్ బుక్ లు రాక పరేషాన్ అయ్యారని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ధరణి అనే దరిద్రం పోయిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి తీసుకొచ్చిందని తెలిపారు. ఏడాది కాలంగా రైతులతో, మేధావులతో రెవెన్యూ అధికారులతో చర్చించి భూ భారతిని సిఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని అన్నారు.అసెంబ్లీ కొత్త ఆర్వోఆర్ చట్టం ప్రవేశ పెట్టినందుకు సంతోషంగా ఉందని అన్నారు. దీంతో రైతులు పండుగ చేసుకుంటున్నారని అన్నారు. యావత్ తెలంగాణ రైతాంగం పక్షాన,కిసాన్ కాంగ్రెస్ తరుపున సిఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.



## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రయాణం సురక్షితం

- సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్
- పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ప్రారంభించిన ఎస్పీ

**పటాన్ చెరు:విశాలభారతి** ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం చేయవచ్చని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఎస్ఎస్ సీ (సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో పటాన్ చెరు మండలం పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియాలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద గల కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఎస్పీ చెన్నూరి రూపేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియాలో అధిక ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించి, సురక్షిత ప్రయాణం చేయాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేసినట్లయితే హై రెజల్యూషన్ గల ఎఎంపిఆర్ సిసి కెమెరాల ద్వారా ఫైన్ విధించడం జరుగుతుందన్నారు. అన్ని పరిశ్రమలకు సంబంధించిన యాజమాన్యాలు సొసైటీలో సభ్యులుగా చేరాలని సూచించారు. ఈ సొసైటీ ద్వారా పరిశ్రమలు, పరిశ్రమలలో పని చేస్తున్న ఉద్యోగుల, మహిళా, ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ద్వారా సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల భద్రత, మహిళల రక్షణ, రవాణా, ట్రాఫిక్ రద్దీ, ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రీస్ సెక్యూరిటి, సైబర్ నేరాలు తదితర సమస్యల నివారణకు కృషి చేస్తున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్ఎస్ఎస్సి జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, వివిధ కంపెనీలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పటాన్ చెరు సబ్‌డివిజన్ సీఐలు లాలునాయక్, నాగరాజు, స్వామి గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీపై కేసు నమోదు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:
పార్లమెంటు ప్రాంగణంలో గురువారం ఉదయం చోటుచేసుకున్న ఘటనలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై కేసు నమోదైంది. బీజేపీ ఎంపీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలకు గాయాలు కావడానికి రాహుల్ గాంధీయే బాధ్యుడని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీలు హేమంగ్ జోషి, అనురాగ్ ఠాకూర్, బాన్సురీ స్వరాజ్ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద రాహుల్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఈ ఉదయం తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. మరోవైపు, అంబేడ్కర్ ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షానికి చెందిన ఎంపీలు సైతం నిరసనలకు దిగారు. ఇరువర్గాల పోటా పోటీ నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో చోటుచేసుకున్న ఘర్షణపూరిత వాతావరణంలో బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. రాహుల్ నెట్టడం వల్లే వారు గాయపడ్డారని, ఆయనపై కేసు నమోదు చేయాలని బీజేపీ ఫిర్యాదు చేసింది.




## కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

ఆమనగల్లు, విశాల భారతి :
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకుల, కార్యకర్తలు కృషి చేయాలని బూత్ కమిటీల ఇంచార్జ్, కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్, 2వార్డు కౌన్సిలర్ దుడ్డు కృష్ణ యాదవ్ కోరారు. అమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగరెడ్డిపల్లి గ్రామం 196 బూత్ కమిటీ అధ్యక్షుడిగా దుడ్డు పాపయ్య, యూత్ అధ్యక్షుడిగా కడారి వీరేష్ లను ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా శాలువాలతో సత్కరించి, నియామక పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు బీజేపీ గెలుచుకునేలా బూత్ కమిటీలు సమర్ధవంతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దుడ్డు యాదయ్య, కుమ్మరి పాండయ్య, దుడ్డు నారాయణ, ఉప్పుల అల్లాజీ, సత్తు బజార్, కడారి బజార్, కుమ్మరి భాస్కర్, కవాలి రమేష్, జంతుక అల్లయ, జంతుక రమేష్, మది చందు, కటిక అల్లయ్య, పల్లె నరసింహ, మల్లేష్, పర్వతాలు, హరిదాసు, శ్రీశైలం, అల్లాజి, మహేందర్, కృష్ణ, రామచంద్రి తదితరులున్నారు.

# భక్తి భావం మానవాళి పురోగమనానికి తోడ్పడుతుంది

- డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా
- అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన రావిచెడు గ్రామం

ఆమనగల్లు, విశాల భారతి :
భక్తి భావం మానవాళి పురోగమనానికి, శాంతి స్థాపనకు దోహదపడుతుందని ప్రజలు భక్తి, దైవ మార్గంలో ముందుకు సాగాలని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డిలు అన్నారు. గురువారం రావిచెడు గ్రామంలో అయ్యప్ప స్వాములు నిర్వహించిన ఇరుముడి మహా పడిపూజ లో ఆయన గంప వెంకటేష్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.. వెంకటేష్ (గురు స్వామి) ముకుంద (గురు స్వాములు) ప్రత్యేక ఇరుముడి పూజలు నిర్వహించారు. ఇరుముడి కట్టుకొని శబరిమలై బయలుదేరిన అయ్యప్ప స్వాములను గంప వెంకటేష్ గుప్తా సన్మానం సన్మానం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. భక్తి మార్గం సమాజశాంతికి దోహదపడుతుందని అన్నారు. అయ్యప్ప మాల ధరించిన స్వాములు 41వ రోజుల పాటు నిష్ఠతో భక్తిశ్రద్ధలతో అయ్యప్పను పూజించుకోవడం జరుగుతుందని అన్నారు. గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి అయ్యప్ప స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు. ఈ ఇరుముడి మహా పడి పూజలో రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, గ్రామ బీఆర్ఎస్ ఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు జోగు వీరయ్య, మాజీ వార్డు సభ్యులు పవన్, మల్లేష్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు బాలకృష్ణ, శ్రీశైలం, నరేందర్ రెడ్డి, బొప్పిడి శివ, జాంగిర్ అలీ, హన్మానాయక్, అశోక్, సోషల్ మీడియా కన్వీనర్ సాయికుమార్, రాములు, రాజు, రవి, రమేష్, జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## ఇల్లు దగ్ధమైన కుటుంబానికి ముత్యాల సునీల్ పరామర్శ

బాల్కొండ, విశాల భారతి
ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన కుటుంబానికి బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ గురువారం పరామర్శించారు. భీమ్‌గల్ మండలం ఎంజి తాండ పరిధిలోని భూక్య తండకు చెందిన మోతీలాల్ ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కు గురై పూర్తిగా కాలిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ముత్యాల సునీల్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించి, ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా పాలనలోనే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

ఆమనగల్లు, విశాల భారతి :
బడుగు బలహీన వర్గాల పేదలకు కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇండ్లు అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇందిరమ్మ కమిటీ సభ్యుడు విజయ్ రాథోడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను గురువారం ఆమనగల్లు మండలంలోని గుడితాండ లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశానుసారము పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యతో కలిసి సర్వేలో పాల్గొన్నారు. విజయ్ రాథోడ్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ప్రజా పాలనలో సమర్పించిన దరఖాస్తు ఆధారంగా కార్యదర్శి ఇందిరమ్మ యాప్ ద్వారా సర్వే చేపట్టడం జరుగుతుందని, ఇందిరమ్మ పథకం కింద పూర్తి సాయి అర్హత గల నిరుపేద కుటుంబాలకు ఇళ్ళను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, వినోద్, రవీందర్,తావుర్య,దేవల్లి,కవిత,హేమి,శారద తదితరులు పాల్గొన్నారు.



## అమిత్ షా రాజీనామా చేయాలి

భీమదేవరపల్లి, విశాల భారతి
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వాక్యాల పై మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ వాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ అమిత్ షా వెంటనే యావత్ భారతదేశానికి క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. భారతదేశంనీ అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు జవహర్ లాల్ నెహ్రూ మొదలుకొని ఇంద్రగాంధీ మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు చేపట్టారని, కాంగ్రెస్ పార్టీ దేశ వ్యవస్థను మొత్తం నాశనం చేసినట్టు బిజెపి నాయకులు అభివర్ణించడం సరికాదన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంటే గౌరవం లేకుండా అంబేద్కర్, అంబేద్కర్ అంటూ అమిత్ షా అపహేళనగా మాట్లాడడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ ని విమర్శించే ముందు ఆయన ఇచ్చిన రాజ్యాంగం తోనే ఉన్నత పదవులు అనుభవిస్తున్నారని విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం అమిత్ షా దిష్టి బొమ్మని, చెప్పులతో కొట్టి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్ రాజ్, హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి మండల జేఏసీ ద్యాగల సారయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ వీరన్న నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, కండే సుధాకర్, అశోక్, ఈశ్వరయ్య, బిక్షపతి, చక్రపాణి, చిదురాల, స్వరూప, శారద, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాల పోరాటంతోనే లగచర్ల రైతులకు బెయిల్

- ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్

ఆమనగల్లు, విశాల భారతి :




బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాల పోరాట ఫలితంతోనే లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు అయ్యిందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో నవంబర్ 11న ఫార్మా విలేజ్ పేరుతో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్ల వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికారులపై దాడి చేశారన్న అభియోగాల కేసులో అరెస్టయి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు 24 మంది రైతులకు నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాల పోరాటంతో దాదాపుగా 40 రోజుల తర్వాత రైతులకు బెయిల్ మంజూరైనందుకు దశరథ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. అమాయకపు గిరిజనులను చూసుకుని దౌర్జన్యంగా వాళ్ల భూములు లాక్కొని అల్లుడికి కట్టబెడదామని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేశారని ఫైర్ అయ్యారు. ఓ పక్క రైతులను జైల్లో వేసుకుంటూ మరోపక్క రైతు పండగ చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన జోష్యం చెప్పారు.

## మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదలకు లబ్ధి చెకురాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:
ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం జరిపిస్తున్న మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలనికలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలోపరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసంప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్నతీరును పరిశీలించిన కలెక్టర్, వారికి సూచనలు చేశారు. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు? సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలనుఆన్లైన్ మొబైల్



యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఈనెలాఖరులోగా ప్రణాళికాబద్ధంగా సర్వే పూర్తి చేయాలని అన్నారు. అర్హతకలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగాఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న దృష్ట్యా, దరఖాస్తుదారుల వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపాలిటీ పరిధిలోని వారు వార్డు అధికారిని, గ్రామాల్లో ఉండే వారు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.




## 'తుర్కయంజాల్‌కు చేంజ్ మేకర్స్ అవార్డ్'

- అవార్డును అందుకున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

తుర్కయంజాల్, విశాలభారతి:
తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు వరించింది. 2022 నుంచి 2024 వరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ప్రదర్శన, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్సిపాలిటీలకు ఈ అవార్డును అందజేశారు. ఢిల్లీలోని సిల్వర్ హోక్ హాల్‌లో సీఎస్ఈ ఎంవోహెచ్‌యుఏ సంయుక్తంగా నిర్వహించిన చేంజ్ మేకర్స్ కన్‌క్లేవ్ కార్యక్రమంలో సీఎస్ఈ డైరెక్టర్ సునీత నరైన్ చేతుల మీదుగా తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఈ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బాల్కొండ,విశాలభారతి



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు భీమ్‌గల్ ఎస్సై మహేష్ ప్రకటనలో తెలిపారు.ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం భీమ్‌గల్ మండలం కుప్కల్ గ్రామా శివారు పొలంలో ఒక వృద్ధుడు స్పృహ కోల్పోయి పడిపోయి ఉన్నాడని సమాచారం రావడంతో అ వృద్ధుడిని అంబులెన్స్ లో నిజామాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్పించడం జరిగిందని అన్నారు. వృద్ధుడు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. మృతుని ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా భీమ్‌గల్ మండలం బాబానగర్ కాలనీకి చెందిన కుండల పెదరాజన్నగా మృతుని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుని భార్య కుండల కసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



# నో యాక్షన్.. నో రిలీజ్




టాలీవుడ్‌లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించిన ముంబై భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే . ఒక లైలా కోసం, ముకుందా సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పిన ఈ భామ మరోవైపు తమిళం, హిందీ భాషల్లో కూడా సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. ప్రతీ ఏడాది చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉండే పూజాహెగ్డేకు 2024 మాత్రం మరిచిపోలేని సంవత్సరంగా మిగిలిపోతుందనే చెప్పాలి. ఎందుకంటే ఈ ఏడాది పూజాహెగ్డే నటిస్తోన్న ఒక్క సినిమా కూడా విడుదల కాలేదు. సల్మాన్ ఖాన్‌తో నటించిన కిసీ కా భాయ్ కిసీ కీ జాన్ 2023 ఏప్రిల్‌లో విడుదలైంది. అప్పటి నుంచి ఈ భామ నుంచి కొత్త సినిమా ఏం విడుదల కాలేదు. ఈ లెక్కన ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండే పూజాహెగ్డేకు 2024 జీరో ఇయర్‌గా మిగిలిపోయిందనే చెప్పాలి. పూజాహెగ్డే ప్రస్తుతం దేవా, సూర్య 44, దళపతి 69 సినిమాల్లో నటిస్తోంది. దీంతోపాటు హాయ్ జవాని తో ఇష్క్ హోనా హై సినిమాలో నటిస్తోంది. వీటిలో దేవా, సూర్య 44 పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా.. దళపతి 69, హాయ్ జవాని తో ఇష్క్ హోనా హై షూటింగ్ దశలో ఉన్నాయి.2020లో త్రివిక్రమ్-అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన అల వైకుంఠపురంలో సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత వచ్చిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రాధేశ్యామ్ బోల్తా కొట్టగా.. బీస్ట్ యావరేజ్ టాక్ తెచ్చుకుంది. మళ్లీ సూపర్ హిట్ కొట్టారనే కసితో వరుస సినిమాలతో బిజీగా మారింది.

# గేమ్ చేంజర్ నుంచి డోప్ సాంగ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన గ్లింప్స్‌తో అంచనాలు ఆకాశన్నంటిన సంగతి తెలిసిందే. తాజాగా దిల్ రాజు పుట్టిన రోజు సందర్భంగా చిత్రం నుంచి నాలుగో పాటకు సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు.

దిల్ రాజు బర్త్ డే సందర్భంగా గేమ్ చేంజర్ మూడో పాట 'డోప్' ప్రోమోను కాసేపటి క్రితమే రిలీజ్ చేశారు. ఇక ఈ ప్రోమోను చూస్తే ఈ పాటను ఏ రేంజ్‌లో శంకర్ పిక్చరైజేషన్ చేశారో అర్థం అవుతోంది. తమన్ ఇచ్చిన బీట్, జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో ఈ సాంగ్ అత్యద్భుతంగా వచ్చినట్టుగా కనిపిస్తోంది.





# యాక్షన్ థ్రిల్లర్ మూవీ "కిల్లర్"

"శుక్ర", "మాటరాని మౌనమిది", "ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ "కిల్లర్" అనే సెన్సేషనల్ సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా పాత్రలో నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్ గా నటిస్తుండగా..మరో ఇద్దరు హీరోలుగా విశాల్ రాజ్, గౌతమ్ యాక్ట్ చేస్తున్నారు. ఏయు అండ్ఐ మరియు మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్ లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. "కిల్లర్" పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ పూర్తి చేశారు. రామెజీ ఫిలిం సిటీ, వికారాబాద్ ఫారెస్ట్ ఏరియా, హైదరాబాద్ లో ఈ షెడ్యూల్ చిత్రీకరణ జరిపారు. సెకండ్ షెడ్యూల్ లో హీరో పూర్వాజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్ మరో ఇద్దరు హీరోలు విశాల్ రాజ్, గౌతమ్ పాల్గొన్నారు.



# హిచ్‌కాక్' బుక్ 'హైదరాబాద్ బెస్ట్ సెల్లర్' అవ్వాలి

## :దర్శకులు హరీష్ శంకర్

''నేను 'అన్వేషణ' సినిమా తీయడానికి హిచ్‌కాక్ కూడా ఓ ప్రేరణ. ప్రముఖ నిర్మాత ఏడిద నాగేశ్వరరావు గారు వీసీఆర్ కొన్నప్పుడు అందులో 'సైకో' చూశా. హిచ్‌కాక్ తీసిన మొత్తం 53 సినిమాలు చూసిన వ్యక్తిని నేను. ఆ విషయం పులగం చిన్నారాయణకు తెలుసు. నా ఆఫీసులో ప్రతి గోడ మీద హిచ్‌కాక్ గుర్తులు ఉన్నాయి. సినిమాకు అవసరమైనవి మూడు... స్క్రిప్ట్, స్క్రిప్ట్, స్క్రిప్ట్ అని చెప్పాడు హిచ్‌కాక్. ఆయన మీద పులగం చిన్నారాయణ, రవి పాడి గొప్ప పుస్తకం తీసుకొచ్చారు. ఇదొక అద్భుతం. రచయితలు ఇద్దరూ నాకు సన్నిహితులు. ఈ పుస్తకం తొలి ప్రతిని చూసి థ్రిల్ అయ్యా'' అని సుప్రసిద్ధ దర్శకులు వంశీ చెప్పారు. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, అలానే ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లు అయిన సందర్భంగా హిచ్‌కాక్ సినీ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ - ఐఆర్ఎస్ అధికారి రవి పాడితో కలిసి పుస్తకం తీసుకొచ్చారు. ఇందులో 45 మంది దర్శకులు, ఏడు మంది రచయితలు, పది మంది జర్నలిస్టులు రాసిన మొత్తం 62 వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.